రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు బసవన్నపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కే. బసవన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కేహెచ్ రవీంద్ర రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు కే.సురేష్ కుమార్, అరుణ తెలిపారు. బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు యువరాజు, వెంకటేశులు, 8వ తరగతి విద్యార్థులు విజయ్ కుమార్, రిహాన్, బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థినులు ప్రవస్తి, అమ్లజ ఎంపికైనట్లు ఆయన చెప్పారు. వీరందరూ సోమ, మంగళవారాల్లో కర్నూలు నగరంలో ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు వివరించారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు అభినందన తెలిపారు. ఈ విద్యార్థుల ఎంపికకు పూర్వ విద్యార్థుల సంఘం క్రీడా పరికరాలు అందించి సహాయ సహకారాలు అందించింది.

పోరాటమే ప్రధాన అజెండా

యుటిఎఫ్ జిల్లా మహాసభలో నాయకులు

ప్రజాశక్తి మడకశిరటౌన్

ఏ ప్రభుత్వమొచ్చినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా యుటిఎఫ్ పనిచేస్తోందని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం సత్యసాయి జిల్లా యూటీఎఫ్ జిల్లా మహాసభ నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లాలోని పలు మండలాల నుంచి ఉపాధ్యాయులు తరలివచ్చారు. యుటిఎఫ్ మహాసభల సందర్భంగా మడకశిర పట్టణం ఎర్రజెండాలతో రెపరెపలాడింది. సమావేశానికి హాజరైనా రాష్ట్ర, జిల్లా, తాలూకా, మండల నాయకులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా వారు పట్టణంలో ఎర్రజెండాలు చేతబట్టుకుని ర్యాలీ నిర్వహించారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెరగాలంటే పీఆర్‌సీనే శరణ్యమన్నారు. సిఎం సానుకూల నిర్ణయం తీసుకోక పోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. బోధనేతర పనులతో అత్యవసర శాఖగా విద్యాశాఖ మారిందని యుటిఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు విమర్శించారు. అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన పనులను ఉపాధ్యాయులతో పనులు చేయించుకుంటున్న పాలకులు ప్రభుత్వ విద్యకు విద్యార్థులను దూరం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుపడినప్పుడే పీఆర్సీ ఇస్తానని సీఎం చెబుతున్నారని ఇది సాధ్యమా అని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్ అలీ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటమే యుటిఎఫ్ ప్రధాన అజెండా అని అన్నారు. ప్రధానకార్యదర్శి సుధాకర్ జిల్లా నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. అంతకు ముందు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జీహెచ్ బాబు, పీఎస్ సీతాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు లక్ష్మినారాయణ, సుబ్బారెడ్డి, శశకంర్, నరేష్‌కుమార్, రామకృష్ణ నాయక్, లతాదేవి, నరసింహప్ప, , రాష్ట్రకమిటీ సభ్యులు మారుతి శ్రీనివాసులు, మేరీ నారకుమారి, మడకశిర మండల అధ్యక్షుడు మహలింగప్ప, ప్రధానకార్యదర్శి జోగప్ప, సీనియర్ నాయకుడు మూడ్డి గిరియప్పతో పాటు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకుల ర్యాలీ

మహాసభల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, తదితరులు

బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

బైక్‌ర్యాలీలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు విమర్శించారు. ఈనెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే 18వ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పుట్టపర్తిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గణేష్ సర్కిల్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులుతో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్. నరసింహులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు హరించేందుకు కుట్రపన్నాయన్నారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం వేతనం పెంచాలని ఏళ్ల తరబడి పోరాటాలు సాగుతున్నాయని ప్రభుత్వాలు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా కార్మికుల శ్రమను దోచుకొని, పెట్టుబడిదారులకు, కంపెనీలకు ప్రయోజనాలను చేకూర్చేలా పనిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 31 నుండి జనవరి 4వ వరకు జరిగే అఖిలభారత మహాసభలలో కార్మికుల సమస్యలను తెలుసుకొని , కార్మిక వర్గం కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయడానికి రూపకల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, కోశాధికారి లక్ష్మినారాయణ, మండల కన్వీనర్ పైపల్లి గంగాధర్, నాయకులు అంకె ముత్యాలు, నాగరాజు, గణేష్, మధు, పెడబల్లి బాబా, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో 'రెవెన్యూ క్లినిక్'

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలకు సులభంగా, వేగవంతంగా రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రెవెన్యూ క్లినిక్" కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఈకార్యక్రమ ఏర్పాట్ల గురించి జిల్లాలోని రెవిన్యూ డివిజినల్ అధికారులు, తహశీల్దార్లతో ఆదివారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేసారు. ఈ రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా అడంగల్ సవరణలు, మ్యుటేషన్ , 1 బి మంజూరు , పట్టాదారు పాసు పుస్తకాలు, అసైన్మెంట్ సమస్యలు , చుక్కల భూమి , ఎస్ఇసి 22తొలగింపు , ఇంటి స్థలం మంజూరు, రాస్తా సమస్యలు , భూ సేకరణ చేసిన భూములకు నష్టపరిహారం, శ్మశాన సమస్యలు , సర్వే కొలతలు , జాయింట్ ఎల్‌పిఎం వంటి భూమి సంబంధిత సమస్యలకు నాలుగు డివిజినల్ వారిగా కౌంటర్లను ఏర్పాటు చేసి సాధ్యమైనంతవరకు అదే రోజు పరిష్కారం చూపించాలని ఆదేశించారు. రెవిన్యూ క్లినిక్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వం చిన్న , సన్న కారు రైతుల ప్రయోజనాల కోసం చేసిన సాదాబైనమా (రిజిస్ట్రేషన్ కాని) భూమిలపై హక్కుల కోసం చేసిన ఉత్తర్వులకు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు.కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని జనవరి 2 నుంచి 9 వరకు జిల్లావ్యాప్తంగా ప్రజా ప్రతినిధుల సమక్షంలో చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

'కూచిపూడి'లో ధర్మవరం బాలికల గిన్నిస్ రికార్డు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

తెలంగాణ లోని హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం లో భారత్ ఆర్ట్స్ అకాడమీ వారు శనివారం నిర్వహించిన కూచిపూడి కళా వైభవంలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీ లలిత నాట్య కళా నికేతన్ బృందం గిన్నిస్ రికార్డు సాధించింది. 25 మంది బాలికలు బృందనాట్యం చేసి మరొకసారి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారని నాట్య గురువులు బాబు బాలాజీ , రామ లాలీత్య తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటిదాకా ఈ సంస్థ 4 సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ ను సాధించటం జరిగిందని చెప్పారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత సీనియర్స్ ఆర్డీటీ జట్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన హెచ్.ఎన్.కే. పండిట్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సీనియర్స్ ఆర్డీటీ జట్టు నిలిచింది. ఎంజిఎం మైదానంలో మూడు నెలల పాటు శని, ఆదివారాలు మాత్రమే 12 జట్లతో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఫైనల్‌కు చేరుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో హిందూపురం క్రికెట్ అసోసియేషన్ ఆర్.డి.టి. సీనియర్స్, హిందూపురం యునైటెడ్ క్రికెట్ క్లబ్ జట్లు పోటీపడ్డాయి. హిందూపురం క్రికెట్ అసోసియేషన్ ఆర్.డి.టి. సీనియర్స్ 20 ఓవర్లకు 155-9 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన యునైటెడ్ క్రికెట్ క్లబ్ జట్టు 20 ఓవర్లకు 148-7 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. దీంతో హిందూపురం క్రికెట్ అసోసియేషన్ ఆర్.డి.టి. సీనియర్స్ టీమ్ విన్నర్ గా నిలిచారు. విన్నర్ టీమ్ హిందూపురం క్రికెట్ అసోసియేషన్ ఆర్.డి.టి. సీనియర్స్ కు రూ.30వేలు నగదు బహుమతి, రన్నర్ గా నిలిచిన హిందూపురం యునైటెడ్ క్రికెట్ క్లబ్ టీమ్ కు రూ.20వేలు నగదు బహుమతి, ట్రోఫీ లను అందజేసారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ టాలెంట్ హంట్ క్రికెట్ అకాడమీ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ హిందూపురంలో క్రీడా అభిమానులకు క్రికెట్ వినోదాన్ని అందించిందన్నారు. క్రీడా వినోదాన్ని అందించి, ప్రతిభావంతులైన క్రికెటర్లుగా తయారు చేయడానికి ఇది ఒక వేదికగా నిలిచిందని తెలిపారు. హెచ్. ఎన్.కే పండిట్ అధ్యక్షులుగా ఉండే సమయంలో హిందూపురంలో క్రికెట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుకు తెచ్చుకున్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సాధారణమైన విషయమని, క్రీడా స్పూర్తి తో ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కోచ్ దీపక్, కోచ్ సాయి కిరణ్, పవన్, లోకేష్, రాజు వివిధ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు షీల్డును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

కురుబలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

కనకదాసు విగ్రహావిష్కరణలో మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

కురుబలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పేరొక్కన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలోని రూకలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహాన్ని మంత్రి ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి సవిత కురుబల కోరిక మేరకు శ్రీభక్తకనకదాసు విగ్రహాన్ని తన తండ్రి యస్ రామచంద్ర రెడ్డి జ్ఞాపకార్థం విగ్రహాన్ని గతంలో అందజేసింది. ఈ నేపథ్యంలో కనదాసు జయంతి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మంత్రి ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ కురుబలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యారంగా అభివృద్ధి చెందాలన్నారు. కూటమి ప్రభుత్వంలో కురుబలకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, మాజీ కన్వీనర్ సిద్ధ లింగప్ప, సర్పంచి కిష్టప్ప, మేకలపల్లి ఆదినారాయణ, చాకర్లపల్లి శ్రీరాములు, ఆంజనేయులు కూటమి నాయకులు, రూకలపల్లి కురుబ సామాజికవర్గం వారు పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, తదితరులు

క్రీడలతో ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి-హిందూపురం

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. అనంతపూర్ జూడో లీగ్ - పెనుకొండ జోనల్ స్థాయి జూడో ఛాంపియన్‌షిప్ 2025-26ను పట్టణంలోని మహాత్మా గాంధీ మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ప్రారంభించారు. ఈ జోనల్ స్థాయి జూడో పోటీల్లో కేజీబీవీ సి.కె. పల్లి, కేజీబీవీ హిందూపురం, ఎం.జె.పి.ఏ.పి.బి.సి.డబ్ల్యూ.ఆర్ పాఠశాల పేరూరు, జెడ్పీహెచ్ఎస్ యాలేరు, జెడ్పీహెచ్ఎస్ మామిళ్లపల్లి, జెడ్పీహెచ్ఎస్ ముదిగుబ్బ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 75 మంది క్రీడాకారులు (50 బాలికలు, 25 బాలురు) తమ ప్రతిభను ప్రదర్శించారు. సమగ్రంగా అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన కేజీబీవీ హిందుపురం పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. ఐదుగురు విద్యార్థులు 5 బంగారు, 4 వెండి, 1 కాంస్య పతకాలు సాధించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులు సెంట్రల్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, క్రీడల వల్ల క్రమశిక్షణ, పట్టుదల పెరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థి తమకు అవగాహన ఉన్న క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ దిశగా తల్లిదండ్రులు సైతం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జూడో వంటి క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక బలాన్ని అందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదగాలంటే ఇలాంటి జోనల్ స్థాయి పోటీలు అవసరమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం, ఎస్ఐ ప్రసన్న, టీడీపీ న్యాయ విభాగం నాయకులు శివశంకర్, మండల విద్యాధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకులు రామాంజినేయులు, కేజీబీవీ ప్రిన్సిపల్ జె.మాధవి, పీఈటీ సావిత్రి, జూడో కోచ్‌లు ప్రవీణ్ కుమార్, రెడ్డప్ప, రియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'పురం' వాసికి మోడీ విజన్ ఆఫ్ భారత్ అవార్డు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన విశ్వం కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అశోక్ కుమార్ జాతీయ స్థాయిలో ప్రధాన మంత్రి మోడీ విజన్ ఆఫ్ భారత్ 2025 పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్ లోని ప్రేకాసి మినీ హాల్లో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ సినిమా దర్శకులు రేలంగి నరసింహారావు, మలేషియాకు చెందిన యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు దేవులపల్లి పవన్ నుండి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ గతంలో సామాజిక, విద్య, రక్తదానాలు వివిధ రకాల సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహించడం, అనాథ, వృద్ధాశ్రమం ద్వారా ఎంతోమందికి వసతి, భోజనం ఏర్పాటు చేయడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి మనం ఫౌండేషన్ ఈ అవార్డు ప్రదానం చేసిందన్నారు. తాను చేసిన సేవలకు గుర్తింపుగా మనం ఫౌండేషన్ చైర్మన్ డా. చక్రవర్తి ఈ అవార్డుకు తనను ఎంపిక చేసి సన్మానం చేశారన్నారు.ఈ అవార్డు ప్రదానోత్సవంలో శివ కుమార్, హైకోర్టు అడ్వకేట్ రామమూర్తి, అమ్మ ఐ అండ్ బాడీ డొనేషన్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు గుత్తా జ్యోష్ణ, జేవి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'తో పిల్లల పరిరక్షణ

బాలల సంరక్షణ జిల్లా అధికారి మహేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖలో అంతర్భాగమైన మిషన్ వాత్సల్య పథకం ద్వారా పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల వయసు వరకు ఉన్న అనాథల ఆదరణ సంరక్షణ అవసరమైన పిల్లలకు వసతి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ తెలిపారు. ఆదరణ కరువై దిక్కులేని బాలలకు తగిన ఆశ్రయం కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ శాఖ ద్వారా బాలల సంరక్షణ కార్యక్రమం చేపట్టింది. సమాజంలో మనం ఎప్పుడో, ఎక్కడో ఒకచోట చెత్త కుప్పలో డస్ట్ బిన్లలో, ముళ్లపొదల్లో అప్పుడే జన్మించిన పిల్లలను వదలి వెళ్లడం చూస్తూనే ఉంటాం. నవజాత పిల్లలను అలా విడిచిపెట్టడం వెనక ఆ తల్లికి వచ్చిన కష్టం ఏమిటో మనకు తెలియదు. సాధారణంగా ఏ తల్లీ నవ మాసాలు మోసి ప్రసవం తరువాత అలా శిశువును వదిలించుకోవడానికి ఇష్టపడదు. అలా జరిగిందంటే దానివెనుక పలు కారణాలు ఉండవచ్చు. అలాంటి సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్ లేదా మహిళా శిశు సంక్షేమ అధికారులకు, అంగన్వాడీ వర్కర్లకు సమాచారం ఇవ్వడం జరుగుతుంది. మరి కొంతమంది పిల్లలు తల్లితండ్రుల ఆదరణ కరువై జీవన పోరాటంలో బిక్షమెత్తుకుని తింటూ ఉండడం చూస్తుంటాం. అలాంటి ఆలనా పాలనా లేని నవజాత శిశువులు, అనాథలను ప్రభుత్వం ప్రత్యేకంగా బాలల సంరక్షణ శాఖ ద్వారా ఆదుకుంటోంది. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలు పలు అంశాలను వివరించారు.

ప్రశ్న: అనాథ, ఆదరణ కరువైన పిల్లల కోసం మీరు తీసుకొంటున్న చర్యలు ఏమిటి.?

అధికారి: ప్రభుత్వం ఇలాంటి అనాథలు, ఆదరణ కరువైన పిల్లల కోసం ప్రత్యేకంగా మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాలు వయస్సులోపు ఉన్న అనాథలను గుర్తించి వారికి తగిన ఆశ్రయం కల్పించి సంరక్షించడం జరుగుతుంది. అందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం బాలల కోసం బాల సదనాలు ఏర్పాటు చేసింది. వారి ఆలనా పాలనా విద్య ఆశ్రయం కల్పించడం జరుగుతుంది.

ప్ర: జిల్లాలో ఎన్ని బాల సదనాలు ఉన్నాయి.? వాటి పనితీరు తెలపండి.?

అధికారి: సత్య సాయి జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు. సంక్షేమ శాఖ ద్వారా రెండు బాల సదనాలు ఉన్నాయి. అవి ధర్మవరం, హిందూపురంలో ఉన్నాయి. ప్రతి బాలసదనంలో ఆశ్రయం కల్పించడంతోపాటు ఒకటవ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఉచిత విద్యను అందించబడుతుంది. అనాథలు, పాక్షిక అనాథ పిల్లలు, పోషించలేని స్థితిలో ఉన్న వారిని ఇక్కడ చేర్పించడం జరుగుతుంది ఈ బాల సదన్‌లో బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆశ్రయం కల్పించడం జరుగుతుంది. అప్పుడే పుట్టిన పిల్లలు అనగా చెత్త కుప్పలో వదిలివేసిన పిల్లలను శిశుగృహంలో ఉంచి బాలల సంక్షేమ సమితి ద్వారా ఆదుకుంటాం. వారి సంబంధికులు రెండు నెలల వరకు కూడా రాని పక్షంలో ఆనాధగా ప్రకటించి చట్టబద్ధంగా దత్తతకోరే వారికి అప్పగించడం జరుగుతుంది. పూర్తి అనాథలకు, పాక్షిక అనాథలకు, మానసిక, శారీరక వికలాంగులకు, హెచ్ఐవి ఉన్న బాలలకు ప్రతినెల ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయలు ప్రభుత్వం మూడేళ్లపాటు సాయం అందిస్తుంది.

ప్ర: మీ శాఖ ద్వారా ఇంకా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

అధికారి: బాలల హక్కులు వారి సంరక్షణ. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాలల పై జరిగే లైంగిక దాడులు తదితర విషయాల గురించి. ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందుకు హెల్ప్‌లైన్ 1098 వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లో సంబంధిత అధికారులకు బాల్య వివాహ నిరోధక చట్టం, లైంగిక నేరాల నిరోధక చట్టం. బాలల న్యాయ చట్టం పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

ప్ర: కిశోరి వికాసం కోసం చేపడుతున్న చర్యలు ఏమిటి.?

అధికారి: కిశోరి వికాసం బాలల యొక్క సాధికారిక అనే నినాదంతో కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ ఆదేశాలతో కిశోరి వికాసంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంటాము. బాల్యవివాహాలు నిరోధించడం, వ్యక్తిగత పరిశుభ్రత, యోగ, ఆత్మరక్షణ, ట్రాఫికింగ్ తదితర అంశాలపై ప్రతి మండలంలోని రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ పొందిన వారు పాఠశాలల్లో, కళాశాలలో 11 నుంచి 18 సంవత్సరాల వయసు గల వారికి అవగాహన కల్పించడానికి కృషి చేస్తారు. 11 నుంచి 14 ఏళ్ల బాల బాలికలకు గ్రూపులు ఏర్పాటు చేసి పిల్లల సమస్యలపై తెలుసుకోవడం జరుగుతుంది. బాల బాలికలు సమస్యలపై కరపత్రాలు, గోడపత్రికల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుంది.

బాలల సంరక్షణ జిల్లా అధికారి మహేష్

ప్రశ్న: ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటీ.?

అధికారి : అనాధ పిల్లల పట్ల సానుభూతిగా ఉండాలి. గ్రామాల్లో బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగిన వెంటనే అక్కడి అంగన్వాడీలకు, హెల్ప్ లైనుకు తెలపాలని కోరుతున్నాం. అలాగే గ్రామస్థాయిలో బాల్యవివాహాలు బాలల హక్కులకు భంగం కలిగిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలి.

పేట్రేగిపోతున్న ఇసుక, మట్టి మాఫియా..!

చెరువులు, వంకల్లోని ఇసుక యథేచ్ఛగా కర్నాటకకు తరలింపు

ఇటుక బట్టీలకు మట్టి సరఫరా.. చోద్యం చూస్తున్న అధికారులు

చెరువులో ట్రాక్టర్‌కు మట్టి నింపుతున్న జెసిబిలు

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొందరు స్వార్థపరులు అక్రమంగా ఇసుక, మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పలారం, కొంకల్లు, గుడిబండ, తదితర గ్రామాల చెరువుల్లో జెసిబిలు ఏర్పాటు చేసి పెద్దఎత్తున మట్టి, ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో నింపి సమీప కర్నాటకలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. వారికి అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో సంబంధిత అధికారులకు ఇదంతా తెలిసినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. కొంకల్లు, ఎస్.రాయపురం పరిసర ప్రాంతాల్లో వంకల్లో ఉన్న ఇసుకను వంక పక్కనే ఉన్న రైతులు ట్రాక్టర్ ఇసుకను రూ. 700 నుంచి రూ. 800కు అమ్ముకుంటుండగా, ఆ ఇసుకను దళారులు కర్నాటకలోని పలు ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ ట్రాక్టర్‌కు రూ. 3వేల నుంచి రూ. 4 వేల వరకూ వసూలు చేస్తున్నారు. అలాగే మరి కొందరు వ్యక్తులు పలు చెరువుల్లో జెసిబిలు ఏర్పాటు చేసి రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గుడిబండ చెరువులో రోజూ జెసిబిని పెట్టి ఇసుక, మట్టిని పెద్దఎత్తున తవ్వి తరలించడం ద్వారా విద్యుత్ సరఫరా కోసం చెరువులో ఏర్పాటు చేసిన స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఇటీవల కాలంలో రెండు, మూడు రోజుల పాటు గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. తమ పంట పొలాల పక్కనే ఉన్న వంకలో దళారులు ఇసుక నింపుకోవాలంటే వంక పక్కనే ఉన్న ఆ భూమి యజమానికి ట్రాక్టర్‌కు రూ. 600 నుంచి రూ. 700 వరకూ వసూలు చేస్తున్నారు. ఇక ఎస్.రాయపురం, కొంకల్లు, గుడిబండ, పలారం, తదితర చెరువులు, వంకల్లో దళారులు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై దినపత్రికల్లో కథనాలు వచ్చినా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం ప్రయోజనం లేదని చెప్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులు, వంకల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక, మట్టి తరలింపును అడ్డుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మట్టి తరలించడంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

గుడిబండ చెరువులో కొందరు మట్టి, ఇసుక తరలిస్తున్నట్లు తెలియడంతో ఇదివరకే తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. ఈ విషయమై త్వరలోనే ఎస్ఐకి కూడా ఫిర్యాదు చేస్తాం. చెరువుల్లో మట్టి, ఇసుకను అక్రమంగా తరలించే ట్రాక్టర్ల యజమానులపై నిఘా ఉంచుతాం. ట్రాక్టర్ నెంబర్లు తీసుకొని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే గాక కేసులు నమోదు చేస్తాం. వంకల పక్కనే ఉన్న రైతులు డబ్బులు తీసుకొని ఇసుకను విక్రయిస్తే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. చెరువు మట్టిని పొలాలకు తోలుకుంటామని చెప్పి రైతులు విక్రయించినా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపడతాం.

- శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ.

ఎక్కడా విద్యుత్ సమస్యలు రానివ్వం

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం : ఎస్ఈ సంపత్ కుమార్

ధర్మవరంలో పర్యటించిన విద్యుత్ శాఖ అధికారులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం నియోజకవర్గంలోని మండలాల్లో ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలనే సంకల్పంతో, ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో ధర్మవరం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అభివృద్ధి పనులను ప్రతిపాదించినట్లు విద్యుత్ ఎస్ఈ సంపత్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేశారన్నారు. ప్రతిపాదిత విద్యుత్ అభివృద్ధి పనుల్లో భాగంగా శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, ఎల్‌టి, హెచ్‌టి లైన్లను బలోపేతం చేయడం, అసురక్షిత, ఆటంకాలుగా ఉన్న ప్రాంతాల నుంచి విద్యుత్ లైన్ల మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య వృద్ధి, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లో-వోల్టేజ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ అంతరాయాలు తగ్గించడం, వోల్టేజ్ సమస్యలు పరిష్కరించడం, ప్రజల భద్రతను మెరుగుపరచడంతో పాటు, గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వారు తెలిపారు. ఈ పనులను ప్రజాహితం దృష్ట్యా త్వరితగతిన చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించగా అవసరమైన పరిపాలనా అనుమతులు, బడ్జెట్ కేటాయింపుల కోసం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ వెల్లడించిందన్నారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు నిరంతర, సురక్షిత, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ కట్టుబడి ఉందని తెలిపారు. ఆయనతో పాటు విద్యుత్ ఏఈలు, జెఈలు నరసింహారెడ్డి, కొండారెడ్డి, జానకిరామ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద, గాంధీనగర్ కాంగ్రెస్ జండా కట్ట పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు తుంపర్తి పరమేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత బలమైన, ఘనమైన పార్టీ కాంగ్రెస్ అన్నారు. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. స్వతంత్ర భారతదేశాన్ని గణతంత్ర దేశంగా మలిచి దేశ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోశించి కూడు, గూడు, గుడ్డ అనే నినాదం నుంచి నింగికి రాకెట్లు పంపే స్థాయికి చేర్చిందన్నారు. ప్రజలకు టెక్నాలజీ, చదువు, విజ్ఞానం, తాగు, సాగు నీరు, వైద్యం, తదితర మౌలిక వసతులు కల్పించిందన్నారు. భారతదేశ ప్రజల్లో అంతర్భాగమైన కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అజరామరంగా ఉంటుందన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం దేశాన్ని, రాజ్యాంగాన్ని, వ్యవస్థలను నాశనం చేస్తోందన్నారు. దేశంలో సుస్థిర, సంక్షేమ పాలన రావాలంటే తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభం తీసుకొచ్చేందుకు అందరం సంఘటితం కావాలన్నారు. అలాగే రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేద్దామని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యుగంధర్, బాషా, నారాయణస్వామి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు రాజ్యాధికారం రావాలి

యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావు యాదవ్

వేదికపై ఐక్యత చాటుతున్న యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావు, నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

బిసి జనాభాలో సుమారు 25 శాతం కలిగిన యాదవులకు రాజ్యాధికారం రావాలని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావు యాదవ్ ఆకాంక్షించారు. ఎపిలోని ప్రతి గ్రామంలో శ్రీకృష్ణ మందిరం నిర్మాణం జరగాలని తెలిపారు. పుట్టపర్తిలో ఆదివారం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసప్ప యాదవ్ ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంగళరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో శ్రీకృష్ణ మందరం నిర్మాణం జరిగేలా ఆయా ప్రాంతాల్లోని యాదవులతో పాటు రాజకీయ పార్టీలు కృషి చేయాలని కోరారు. బిసి జనాభాలో దాదాపు 25 శాతం కలిగిన యాదవులకు రాజ్యాధికారం రావాలని, అన్ని పార్టీల నుంచి యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యపరంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీలతోపాటు బీసీలలోని అనేక కులాలను కలుపుకొని యాదవులు రాజకీయంగా అభివద్ధి చెందాలన్నారు. 3, 4 శాతం ఉన్న కులాల వారు పదవులు పొందుతున్నారు, కానీ బిసిల్లో అత్యధిక జనాభా కలిగిన యాదవులు రాజకీయంగా ఎందుకు అభివృద్ధి సాధించలేకపోతున్నారన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో యాదవులకు రాజకీయంగా ఎటువంటి స్థానం లభించలేదన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రాంతీయ పార్టీలు, నేడు కేంద్రంలో కొనసాగుతున్న బిజెపి యాదవులకు రాజకీయంగా కాస్త అవకాశాలు కల్పించాయన్నారు. రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది యాదవులు ఉన్నారని జనాభా ప్రాతిపదికన దాదాపు 25 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాలు యాదవులకు రావాల్సి ఉందన్నారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నాయని, రాజ్యాధికారం కల్పించడంలో విఫలం అవుతున్నాయన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో యాదవులకు ఒక్క మంత్రి పదవి మాత్రమే లభించిందని, నేడు బిజెపి ప్రభుత్వంలో నలుగురికి మంత్రి పదవులు లభించాయన్నారు. కేంద్రంలో యాదవులకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటుచేసి, శ్రీకృష్ణ మందిరాలు నిర్మాణం చేయడానికి సహకరించాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం యాదవులకు తగినన్ని సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య పరంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి మండలం నుంచి యాదవ కులస్తులు పోటీ చేయాలన్నారు.

తిరుమలలో శరభయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

తిరుమలలో యాదవ కులానికి చెందిన శరభయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ తెలిపారు. రాజధాని ప్రాంతంలో యాదవులకు ఐదెకరాల స్థలం కేటాయించి యాదవ భవన్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. విశాఖపట్నంలో యాదవ భవనానికి ప్రభుత్వం 50 సెంట్ల స్థలం కేటాయించిందన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం యాదన్న పథకం అమలు చేయబోతుందన్నారు. యాదవుల్లో చదువుకుంటున్న విద్యార్థులతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జాతీయ వైస్ ప్రెసిడెంట్ అన్నా రామచంద్రయాదవ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, యాదవ్ సంఘం జిల్లా కార్యదర్శి ఉమాపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తూ దినసరి కూలీ మృతి చెందిన సంఘటన ఆదివారం కదిరి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. కదిరి రూరల్ మండలంలోని రాచువారిపల్లికి చెందిన సాయి కుమార్‌నాయక్ పట్నం గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. స్తంభంపై నిల్చొని పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ జారి కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన హాస్పిటల్ తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా విద్యుత్ అధికారులు సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే సాయికుమార్‌నాయక్ మృతి చెందారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హాస్పిటల్ వద్ద కదిరి-హిందూపురం రోడ్డుపై రాస్తారోకో చేశారు. దీంతో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పి విరమింపజేశారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని మోపర్లపల్లి గ్రామానికి చెందిన చాకలి సురేష్(24) హైదరాబాద్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. మోపర్లపల్లి గ్రామానికి చెందిన చాకలి వెంకటేష్, దుర్గమ్మ దంపతుల రెండో కుమారుడు సురేష్ ఐదేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. అప్పటి నుంచి అక్కడే ఏదో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడు శనివారం రాత్రి గదిలో ఉరి వేసుకున్నాడు. ఈ విషయం గమనించిన రూమ్ మేట్స్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో సురేష్ తల్లిదండ్రులు వెంటనే హైదరాబాద్ వెళ్లి కుమారుడి మృతదేహాన్ని తీసుకొస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి మృతికి కారణాలు తెలియ రాలేదు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సిఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా పిడిఎస్ బియ్యాన్ని ఆటోలో అక్రమంగా కర్నాటకకు తరలిస్తుండగా ఆదివారం పట్టణంలోని లక్ష్మిచెన్నకేశవపురం కూడలి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఎస్.బాబావలిని అదుపులోకి తీసుకొని ఆటోను సీజ్ చేశామన్నారు.

కేశగాళ్ల శ్రీనివాసులుకి అభినందనలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణానికి చెందిన టిడిపి నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా ఎన్నిక య్యారు. దీంతో ఆదివారం నాయకులు జూటూరు మహేంద్ర, కునుతూరు వెంకటేష్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలు పరిష్కరించి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూటూరు శ్రీదేవి, తీర్థప్రసాద్, నూరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు

బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే అండర్-19 ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ స్కూల్ గేమ్స్ జట్టుకు ధర్మవరం బాల బాలికలు ఎంపికయ్యారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జయచంద్రారెడ్డి, మేడాపురం రామిరెడ్డి తెలిపారు. వారు ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జనవరి 1 నుంచి 6వ తేదీ వరకూ రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్-19 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ జట్టుకు ధర్మవరం పట్టణానికి చెందిన విజయ్ తరుణ్, బాలికల విభాగంలో కిరణ్మయి ఎంపిక కావడం గర్వకారమని తెలిపారు. వీరు గత నెల విజయవాడలో జరిగిన జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాయుడు, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు హర్జిత్ ప్రణవ్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. వీరు జాతీయ స్థాయిలో కూడా రాణించి ధర్మవరం పట్టణానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఆదివారం రాజస్థాన్‌కు బయల్దేరి వెళ్లారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

ఉద్యోగోన్నతి పొందిన అధికారులను సన్మానించిన ఉద్యోగులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి ఆర్టీసీ డిపోలో ఎడిసిలుగా పని చేస్తున్న బి.ఉత్తన్న, సాయినాథ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-3 లుగా, సి.సుబ్బరెడ్డి సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఆదివారం వారిని కదిరి డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ఎన్ఎంయుఎ రాష్ట్ర అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పివి.రమణారెడ్డి విశేష కృషి వల్ల నేడు కదిరి డిపోలో పెద్ద ఎత్తున ఉద్యోగోన్నులు లభించాయన్నారు. ఉద్యోగోన్నతి పొందిన వారు తదుపరి బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి సంస్థకు మంచి పేరు తేవాలని నాయకులు హరిమోహన్ కోరారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమకు ఉద్యోగోన్నతులు కల్పించినందుకు సిఎం చంద్రబాబు, ఆర్టీసీ ఎండి, ఛైర్మన్, అసోషియేషన్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వి.రమణ, డిపో నాయకులు బైరిశెట్టి, రామక్రిష్ణ, అశ్వర్థమయ్య, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, బాలునాయక్, రామయ్య, సలీంబేగ్, అంజనప్ప, నాగమునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

ఎపిటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రొద్దం

ఎపిటిఎఫ్ 2026 డైరీ, నూతన సంవత్సరం వాల్ క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్లను ఆదివారం పెనుకొండ పట్టణంలోని తన నివాసంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఎపిటిఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు ఎం.ఫణీంద్ర, ప్రధాన కార్యదర్శి వైబి.చంద్రమౌళి, స్టేట్ కౌన్సిలర్ కె.మల్లికార్జున, జిల్లా ఆడిట్ కన్వీనర్ వై.నాగభూషణం, ఎం.శ్రీనివాసులు, టిసిఎస్ డైరెక్టర్స్ ఎస్.కృష్ణానాయక్, డి.రంగేష్, కె.రమేష్‌బాబు, బి.మల్లికార్జున, బాలవెంకటేష్, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవి వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ సూచనలతో ఆదివారం సిఐ పట్టణంలోని పాతనేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వారందరినీ స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారు. ఎవరైనా ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి నేరాల్లో పాల్గొన్నా తీవ్రమైన తప్పవని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆడిటోరియంలో సమావేశమయ్యారు. సుమారు 20 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలవడంతో అందరూ రోజంతా మైమరచి సంతోషంగా గడిపారు. ముందుగా ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులు రామచంద్రారెడ్డి, మాధవీలత, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్, జయచంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీనరసింహ, ఉమాదేవి, అమీర్, శంకర, కుళ్లాయిరెడ్డి, ప్రకాష్, లక్ష్మీపతి, చెన్నకృష్ణారెడ్డి, తదితరులను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. దుస్తులు అందజేసి వారి ఆశీర్వాదం పొందారు. వారి గురువులు మాట్లాడుతూ ఎన్నో ఎళ్లయినా తమను గుర్తు ఉంచుకుని సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోయ లక్ష్మీనారాయణ, గాండ్ల శ్రీనాథ్, గోపీనాథ్, సింగిరి శ్రీనివాసులు, రియాజ్, జబి, వెంకటేష్, అజ్మతుల్లా, దివాకర్‌రెడ్డి, శ్రీకాంత్, మునాఫ్, బాలు, బండ్ల శివ, ఓబుల్‌కుమార్, నరేష్, చైతన్య, కలీం, లోకేష్, షబ్బీర్, మునాఫ్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల కేంద్రమైన నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు 27 ఏళ్ల తర్వాత కలిసిన వారు రోజంతా సంతోషంగా గడిపారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారి గురువులైన సత్యానందం కొండారెడ్డి, శంకర్‌బాబు, నారాయణ, బాలు, శకుంతల, ప్రమీలను ఘనంగా సత్కరించి సన్మానించారు. అందరి సకారంతో పాఠశాలకు రూ. 1.6 లక్షల విలువ చేసే 8 సీసీ కెమెరాలను అందజేశారు. హాజరైన వారందరికీ గుర్తుగా జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎసిటిఒ నాగేంద్రబాబు, లక్ష్మీపతిరెడ్డి, శ్రీనివాసులు, విశ్వేశ్వర, భారతి, వసంత, రామరాజు, షాకీర్, చంద్ర, విజయలక్ష్మి, రాధిక, ప్రమీల, భాస్కర్, వెంకటేష్, మొత్తం 68 మంది పాల్గొన్నారు.



నల్లచెరువు ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మసీదు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-అమరాపురం

మండల కేంద్రమైన అమరాపురంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం గౌసియా మసీద్ కమిటీ సభ్యులు నూతన మసీద్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథులుగా టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షురాలు కెఎన్ఎం.రత్నమ్మ నరసింహమూర్తి, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ హాజరై భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వెన్నెముకగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ దాదు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రికెట్ జట్టు ఎంపికపై డిఇఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఉపాధ్యాయ క్రికెట్ జట్టు ఎంపికలో తమకు అన్యాయం చేశారని కొందరు ఉపాధ్యాయులు డిఇఒ క్రిష్టప్ప కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు గాలికి వదలి ఓడిన జట్టులోని సభ్యులను రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు వెంకటేష్‌నాయక్, ఆదిశేషు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రతిష్టాత్మకంగా జిల్లాలో మండలాల వారీగా ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు నిర్వహించిందన్నారు, ఈ పోటీల్లో ధర్మవరం ఎస్‌జిఎఫ్ జట్టు విజయం సాధించింది. అయితే అధికారులు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి జట్టు సభ్యులని ఇష్టారాజ్యంగా ఎంపిక చేసి విజేత జట్టు సభ్యులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, బాబా పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అల్పాహారం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రమైన సోమందేపల్లిలోని మార్కెట్ రోడ్డులో ఉన్న మసీదు సమీపంలో నివాసం ఉంటున్న డ్రైవర్ అతావుల్లా ఆదివారం అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఆయన స్థానిక శివానగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఉదయం 30 మంది అయ్యప్ప మాలధారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని కలెక్టరేట్‌లో ఆదివారం ఎపి రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సభ్యుల జిల్లా స్థాయి ఎన్నికలు నిర్వహించారు. ఇందులో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆర్ఎస్. దివాకర్‌రావు వ్యవహరించారు. హిందూపురం డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్‌ను జిల్లా అధ్యక్షులుగా, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ వి.గిరిధర్‌ను అసోసియేట్ అధ్యక్షులుగా, పుట్టపర్తి తహశీల్దార్ బివి.కల్యాణ చక్రవర్తిని సెక్రటరీగా, శ్రీకాంత్‌ను కోశాధికారిగా, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



ఎన్నికైన ఎపి రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా సభ్యులు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.మారుతి ప్రసాద్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాడిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ 11వ పిఆర్‌సి కాల పరిమితి 2023 జూన్ నాటికి ముగిసిందని, 2023 జులై 1 నుంచి 12వ పిఆర్‌సి అమలు కావాల్సి ఉందన్నారు. రెండున్నరేళ్లు దాటినా నేటికీ కనీసం పిఆర్‌సి కమిషన్‌ను నియమించకపోవడం శోచనీయం అన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.జయకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సి.నరేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మక్కిశెట్టి కుమార్, కోశాధికారి ప్రదీప్‌కుమార్ జిల్లా, డివిజన్ నాయకులు కిష్టప్ప, కె.మారుతి, జి.శ్రీనివాసులు, దారా కిష్టప్ప, గాజుల సౌజన్య, కరిబడప్ప, ఎన్.శ్రీనివాసులు, బాబు రమేష్, నరసింహమూర్తి, లోకేష్ కృష్ణ, నాగరాజాచారి, అర్జున్, నాగార్జున, రమేష్ నాయక్, మహిళా ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రమైన లేపాక్షిలోని దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ కుటుంబ సమేతంగా సందర్శించారు. వారికి అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. ఎస్పీ ఆలయాన్ని పరిశీలించి ఆలయంలోని చిత్రకళలు, శిల్పకళ చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. ఏక శిల నంది విగ్రహం చాలా అత్యద్భుతమన్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎస్పీని ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. ఎస్పీ వెంట సిఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర, ఈఓ నరసింహమూర్తి, అర్చకులు శీనస్వామి ఉన్నారు.



ఎస్పీని సత్కరించిన ఆలయ కమిటీ ఛైర్మన్, అర్చకులు